




ఆర్‌టిసి బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రజలకు రవాణా సౌకర్యాలను మరింతగా మెరుగురపరిచేందుకు రెండు కొత్త ఆర్‌టిసి బస్సు సర్వీసులను సోమవారం కందుకూరు డిపో ప్రాంగణంలో ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2004లో ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిన తర్వాత ప్రజలు ప్రయాణానికి ఆటోలను మాత్రమే ఆశ్రయిం చాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది పలు గ్రామాల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించిందన్నారు. ప్రజల అవసరాలు, కష్టాలు గమనించి మళ్లీ అమ్మవారి పాలెం మీదుగా కావలికి బస్సు సర్వీసులను ప్రారం భించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సర్వీసులు విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రైతులు, అమ్మవారిపాలెం, అడవి రాజుపాలెం గ్రామాల ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. డిపో మేనేజర్ ఆర్. శ్రీనివాసులు, నాయకులు దామా మల్లేశ్వర రావు, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, కూనం నరేంద్ర , ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, గోచిపాతల మోషే, మధుబాబు, పాల్గొన్నారు.



కాంగ్రెస్‌కు మళ్లీ జీవం వచ్చేనా..!

-జిల్లాలో నాయకత్వ లోపం

-నియోజకవర్గాల్లో అడ్రస్ లేని జాతీయ పార్టీ

-నేడు వైఎస్ షర్మిల రాక

ఒకప్పుడు జిల్లా రాజకీయాల్లో మగుటంలేని మహరాజుగా వెలిగిన కాంగ్రెస్ పార్టీ నేడు జీవం కోల్పోతోంది..ఎందరో నేతలు రాజకీయ భవిష్యత్తు అందించిన జాతీయ పార్టీకి నియోజకవర్గాల్లో పట్టుమని పది మంది లేకుండా పోయారు.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలతోపాటు అందించిన పార్టీకి ఇప్పుడు చెప్పుకోదగ్గ నాయకులు లేకుండా పోయారు..ఉన్న నాయకత్వం పటిష్టంగా పనిచేస్తుందా అంటే అది కనిపించడం లేదు.. అడపా, దడపా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మమ అని పిస్తున్నారు.. ఇటీవల ఎన్నికలో మాజీ ఐఎఎస్ అధికారి కె. రాజు పోటీచేస్తే సుమారు 50 వేల ఓట్లు వచ్చాయి. ఇప్పటికీ ఆపార్టీని అభిమానించే వ్యక్తులు అక్కడక్కడా ఉన్నప్పటికీ వారందనీ కలుపుకుపోయే నాయకత్వం తీవ్ర కొరతగా కనిపిస్తోంది. నేడు ఆపార్టీ పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలా నెల్లూరు రానున్నారు. కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్‌కు మళ్లీ జీవం పోసే పనిచేస్తారా లేదా చూడాలి..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కాంగ్రెస్‌పార్టీ ఒకప్పుడు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఓ వెలుగు వెలిగింది. ముఖ్యమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డితోపాటు ఆనం చెంచుసుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడి, మాగుంట సుబ్బరామిరెడ్డిలతోపాటు ఎందరో ముఖ్యనాయకులకు రాజకీయ జన్మనిచ్చింది.. దశాబ్దాలపాటు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కంచుకోటగా నిలిచింది. 2014 ఎన్నికలకు ముందు ఆపార్టీ రాష్ట్ర విభజనలో తీసుకున్న తప్పుడు నిర్ణయంతో జిల్లాలో ఆపార్టీకి చావుదెబ్బ తగిలింది. కాంగ్రెస్‌పార్టీలో ఉన్న నేతలంతా వైసిపిలో చేరారు. నాయకులు, కార్యకర్తలు వైసిపి, టిడిపిలోకి వెళ్లిపోయారు.. ఒకరిద్దరు నాయకులు మాత్రమే ఆపార్టీకి మిగిలారు. ఇంతటి పరిస్థితి నుంచి కోలుకోవాలంటే కొంత సమయం పడుతుంది. ఇప్పటికి పన్నెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ దెబ్బనుంచి ఇప్పటికీ కోలుకోలేకుండా పోయింది. ఒకరో, ఇద్దరో నాయకులు మిగిలినా కేవలం నాయకులుగా చలామణి అవుతున్నారే తప్ప పార్టీని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన చేస్తున్నట్లు కనిపించడం లేదు. ఏదైనా రాజకీయ పార్టీ నిలబడాలంటే ప్రజా సమస్యలపై పనిచేయాలి, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టాలి. మేమున్నామంటూ ముందు కనిపించాలి. అలాంటి పరిస్థితి నెల్లూరు జిల్లాలో ఏమాత్రమూ కనిపించడం లేదు. కొత్త వ్యక్తులు రాకపోగ, మిగిలిన ఒకరో, ఇద్దరు వెళ్లిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లా స్థాయిలో పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి నాయకుల వద్ద ఏలాంటి కార్యచరణ కనిపించడం లేదు. రాష్ట్ర నాయకత్వం షరా మామూలుగానే కనిపిస్తోంది. అనేక ఎన్నికల్లో, సందర్భాల్లో కాంగ్రెస్‌పార్టీకి ఎదురుదెబ్బలు తగిలినా ఆపార్టీని అభిమానించే వ్యక్తులు ఇప్పటికీ అనేక మంది కనిపిస్తుంటారు. ఇలాంటి వారికి కాంగ్రెస్ పార్టీ ఒకటుందని, అది బతికుందని చెప్పే ప్రయత్నాలు జిల్లాలో జరగడం లేదు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రాకపోయినా కనీసం బతికుందనే భరోసా నాయకులు, కార్యకర్తలకు కలిగించడం లేదు...



వైఎస్ షర్మిల, పిసిసి అధ్యక్షురాలు

మంచి వ్యక్తులు... నాయకత్వానికి భరోసా ఉందా..?

కాంగ్రెస్ పార్టీకి అనేక మంది దూరమైనా మంచి వ్యక్తులు, నాయకత్వం ఉంటే ప్రజలు కనీసం గుర్తిస్తారని గత ఎన్నికల్లో తెలిపాయి. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ పోటీచేసినా తాను ఉన్నానని ముందుకొచ్చింది. ప్రజలు ఆపార్టీ గురించి కాస్త ఆలోచన చేశారు. జాతీయ పార్టీ , స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నపార్టీ, దేశంలో మతోన్మాద శక్తులు ముందుకు వస్తున్నవేళ తాము బలంగా ఉన్నామని కాంగ్రెస్ బలపడాలని అనేక మంది ఆశపడుతున్నారు. అందుకు అనుగుణంగా కాంగ్రెస్‌పార్టీ కార్యచరణ కనిపించడం లేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నుంచి పూర్వపు కలెక్టర్ కె రాజు పోటీచేశారు. ఆయన కేవలం 20 రోజులు ముందు మాత్రమే ఇక్కడకు వచ్చారు. ఆయనకు ఉన్న మంచిపేరు, కాంగ్రెస్ పట్ల ఉన్న అభిమానంతో సుమారు 50 వేల ఓట్లు సాధించారు. నెల్లూరు నగరంలో 25 వేలు, ఇతర ప్రాంతాల్లో మరో 25 వేల ఓట్లు వచ్చాయి. ముందు నుంచి పనిచేసుంటే సుమారు లక్ష ఓట్లు వరకు వచ్చేవని ఆపార్టీ అంచనా వేసింది. రాజకీయ వ్యూహం, ప్రాతినిధ్య లేకపోవడంతో కాస్త ఓట్లు తగ్గాయి. ఈ ఎన్నికల్లో పోటీచేసిన కొప్పుల రాజు అభ్యర్థి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తానున్నానంటూ కనిపిస్తున్నారు. అప్పుడప్పుడు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగర ఈ ఎన్నికల్లో పోటీచేసిన ఏ ఒక్క అభ్యర్థి ప్రస్తుతం కనిపించడం లేదు. నియోజవర్గాల్లో పార్టీ బలోపేతానికి ఏలాంటి కార్యాచరణలేదని ఆపార్టీ నేతలే అంటున్నారు. వైఎస్ షర్మిల నేడు నగరానికి రానున్నారు. ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్‌పార్టీకి జీవం పోసే చర్యలపైనా తీసుకుంటారా అని ఆపార్టీలో నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు....

కరేడులో బలవంతపు భూసేకరణను ఆపాలి

ప్రజాశక్తి-ఉలవపాడు

మండలంలోని కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కరేడు పరిధిలో ఇండోసోల్ కంపెనీకి మొదట విడతగా 1345 ఎకరాల భూమిని, ప్రజాభిప్రాయాలను తీసుకోకుండా ఏకపక్షంగా కరేడు రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, పొట్టేను గుంట వంటి ఎస్‌సి, ఎస్‌టి ఎస్‌సి కాలనీలను భూమి చేయించి,ఆ ప్రాంతాన్ని పరిశ్రమల అభివృద్ధి పేరుతో ప్రయివేట్ కంపెనీలకు అప్పనంగా అప్పజెప్పాలని ఈనెల 19న ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. దీనిపై సిఐటియు, ఎపిరైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆయా ప్రాంతాల్లోని ఇందిరా నగర్ కాలనీలో పర్యటించి, నిర్వాసితులతో మీటింగ్ ఏర్పాటు చేసి ముఖాముఖి చర్చించారు. ప్రజా అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు .సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ కరేడులో పరిశ్రమల అభివృద్ధి కోసం భూసేకరణ జీఓ ప్రభుత్వం వారు జారీ చేసిన తర్వాత గ్రామసభలు నిర్వహించి, ఆయా గ్రామసభలలో నిర్వాసితుల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. అలా చేయకుండా, ప్రభుత్వాధికారులు ప్రజాభిప్రాయాలతో సంబంధం లేకుండా భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం సరైనది కాదన్నారు. వ్యకాస జిల్లా కార్యదర్శి మంగాల పుల్లయ్య మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు ఇవ్వనున్న ప్రభుత్వ ధర కంటే, మూడు రెట్లు కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడారు. పచ్చని పంటలు పండే విలువైన భూములను, పండ్ల తోటలను పండించే భూములను పరిశ్రమలకు ఇవ్వడం సరి కాదని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మూలం.రమేష్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములు తీసుకోవాలి తప్ప, నిత్యం3 పంటలు పండే పండ్ల తోటలు, మాగాణి ప్రాంతాలను,ఎస్సి ఎస్టీల భూములను నేరుగా తీసుకుంటున్నట్లు నోటిఫికేషన్ లో జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ప్రజాభిప్రాయాలు పట్టవా అని అన్నారు. ఎక్కడ భూసేకరణ జరిగిన అక్కడ నష్టపోతున్నది బలహీనవర్గాలేనని అన్నారు. నిర్వాసితులు తరఫున నిరంతరం ప్రజా సంఘాలు నిలబడతాయని, పోరాడుతాయని, న్యాయం జరుగుతుందని, నిర్వాసితులు అందరూ కలిసి రావాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు పరిధిలోని సాలిపేట ప్రాంత నిర్వాసితులకు నేటికీ ఇళ్ల స్థలం ఇవ్వలేదని పేర్కొన్నారు.సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఏ గౌస్, పొన్నం రామలక్ష్మమ్మ, కత్తి మహేష్, శేషమ్మ లు మాట్లాడారు. అనంతరం కరేడు ఉప్పరపాలెంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ డి గౌస్ బాషా, దువ్వూరి జాన్, మల్లవరపు లలితమ్మ, గంజి రమణమ్మ,కత్తి అనిల్, కత్తి దుర్గాప్రసాద్, వీసం విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి -నెల్లూరు

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికు లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, 60 సంవత్సరాల నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వా లని,వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఇంజనీ రింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని ర్యాలీలో నినదించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి మాట్లాడారు. మునిసిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో, పస్తులతో, అప్పులతో జీవితాలు గడుపు తున్నారని అన్నారు. నిరంతరం చెత్తాచెదారాలు మలినాలు మలమూత్రాలు వద్ద పనిచేసే మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వ తీరు మారాలన్నారు. దళితులు గిరిజనులు బలహీనవర్గాల పట్ల కూటమి ప్రభుత్వ వివక్ష పూరిత ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. దళితులు గిరిజ నులు బలహీన వర్గాలుగా ఉన్న మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం వివక్షపూరిత ధోరణితో వ్యవహ రిస్తున్నదని అన్నారు. తక్షణమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు బేషరతుగా మున్సిపల్ కార్మి కులందరికీ వర్తిం పజేయాలని డిమాండ్ చేశారు. ధర్నా శిబిరం వద్దకు వచ్చిన కార్పొరేషన్ కమిషనర్ వై. ఓ.నందన్‌కు నాయకులు, కార్మికులు వినతిపత్రం సమర్పిం చారు. సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, మట్టిపాటి శ్రీనివాసులు, సుజాతమ్మ, లోకేష్ భాగ్యమ్మ, మనోజ్,జైకుమార్, షబ్బీర్, రాంబాబు, పందల శ్రీని వాసులు, దార్ల మాలకొండయ్య, బాలు, కొండమ్మ, వజ్రమ్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



మాట్లాడుతున్న సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి -నెల్లూరు

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ హక్కుల కోసం ఐక్యత పోరాటాలు చేసి తమ సమ స్యలు పరిష్కరించుకోవాలని సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్ అన్నారు.సోమవారం అపోలో సెంటర్లోని జక్కా వెంకయ్య భవనంలో వి ఆర్ సి ,ముత్తుకూరు బస్టాండ్ సిఐటియు ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.' సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్ ఆటోకార్మి సంఘం రూరల్ కార్యదర్శి ఎం సుధాకర్ హాజరై మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ హక్కుల కోసం ఐక్యత పోరాటాలు చేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ చలానాల పేరుతో ప్రభుత్వం పోలీస్ అధికారులు టార్గెట్స్ ఇచ్చి ఆటో కార్మికుల మీద వేలాది రూపాయలు ఫైన్ లు వేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా ఆటో కార్మికులు పోరాడాలన్నారు. ఈనెల 27వ తేదీ ఆటో కార్మిక సంఘం రూరల్ మహాసభ మన్సూర్ భవన్ లో జరుగుతుంది కావున రూరల్ ప్రాంతంలోని ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 17వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి షేక్ నజీర్ పెంచలయ్య ప్రదీప్ ప్రతాప్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్

పాత విద్యుత్ స్తంభాల కారణంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని పునరుద్ధరించాలని 13వ డివిజన్ జనసేన ఇన్‌ఛార్జి పెనేటి శ్రీకాంత్ కార్పొరేషన్ అధికారులను కోరారు. జనసేన సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తదితరులతో కలిసి కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. యలమవారిదిన్నె ప్రాంతం రాజీవ్ గాంధీ కాలనీలో విద్యుత్ లైన్లు భూమికి అత్యంత దగ్గరగా వేలాడుతూ ప్రమాదకరంగా మారాయన్నారు.శివకష్ణ, సుధా మాధవ్, నూనె రిషికేశ్ యాదవ్, పెయ్యల పవన్ కుమార్ యాదవ్, తాళ్ళూరి వెంకట్ యాదవ్, వర్షాచలం రాజేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సూచనతో కందుకూరు వాసవి క్లబ్ లెజెండ్స్, కందుకూరు వనిత క్లబ్ ఆధ్వర్యంలో డోన్ టు డస్క్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వాసవియన్, డైమండ్ స్టార్ కేసీజిఎఫ్ హనుమాన్ శెట్టి సీతారామయ్య, గెస్ట్ ఆనర్ గా వాసవియన్ 3 కే సి జి ఎఫ్ తమ్మన పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గోశాలలో గరుకు స్తంభం ఏర్పాటు చేశారు. పాఠశాలలో పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, విక లాంగుల పాఠశాలలో మంచం, పరుపు, సిమెంటు బల్లలు, టి ఆర్ ఆర్ కళాశాలలో సిమెంట్ బల్లలు అందజేసి మొక్కలు నాటారు.కందుకూరి వాసవి క్లబ్ నాయకులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు : పజలు సంతప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీతో పాటు డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సర్వేరికార్డుల ఎడి నాగశేఖర్ అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు.

నగరంలోని వేదాయపాలెం చంద్రమౌళి నగర్లో సర్వేనెంబరు 78/2లో గతంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని రిటైర్డ్ ఉద్యోగి పోగుల విజయసేన్‌కుమార్ నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమించి బిల్డింగ్ నిర్మించి అమ్మేందుకు ప్రయత్ని స్తున్నారని, వెంటనే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని చేకూరి సురేష్ అర్జీ అందజేశారు.

పాఠశాలలో సీటు ఇప్పించండి

విద్యాహక్కుచట్టం కింద తమ కుమార్తె గోనుగుంట దేవిక 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశం పొందేందుకు సెలెక్ట్ అయినట్లు, శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్లో సంప్రదించాలని ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని, అయితే ఆ పాఠశాల వారు తమ పాపను చేర్చుకోకుండా, ఫీజులు కట్టి చేరాలని ఇబ్బందులు పెడుతున్నారని పి.భవాని అర్జీ అందజేశారు. దీనిపై స్పందించి పాఠశాలల సీటు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్

కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. విభాగాల వారీగా అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఇ రామ్మోహన్రావు, టౌన్ ప్లానింగ్ సిపి హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో...

డంపింగ్ సమస్యపై జనసేన వినతి

డ్రెయినేజీ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించకుండా పెన్నా నది ఒడ్డు దేవస్థానం రోడ్డులో పారబోస్తున్నారని నెల్లూరు జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,ఐ టి కోఆర్డినేటర్ శివకష్ణ, జనసేన నాయకులు బెల్లపు సుధామాదవ్,1వ డివిజన్ నాయకులు పవన్ యాదవ్,13వ డివిజన్ పేనేటి శ్రీకాంత్ ,రాజేష్,వెంకట్ యాదవ్,జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,ఋషి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు అభివృద్ధికి సహకరించాలి : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పురపాలక సంఘం లో జరిగే అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కోరారు.కందుకూరు పట్టణ టిడిపి కార్యాలయంలో సోమవారం ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రివర్యులు నారా లోకేష్‌ల సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ.22 కోట్లతో టెండర్లు పిలిచారని తెలిపారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యపాలనతో వ్యవసాయ రంగం నష్టపోయిందని గుర్తు చేస్తూ ప్రస్తుతం ప్రతి నియోజకవర్గానికి సుమారు 3కోట్ల రూపాయలు నిధులను నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ కోసం కేటాయించామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం నియోజ కవర్గంలో ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహిం చామని తెలిపారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో రప్పా రప్పా నరుకుతానంటే మంచిదే కదా అంటూ జగన్ మాట్లాడటం రౌడీయిజం హింసను ప్రేరేపించేలా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3 కోట్ల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఒసి చెక్కులను బాధితులకు అందించామని తెలిపారు.సోమవారం మరో 27 మందికి రూ. 24,63,000 అందజేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

పిడిఎస్‌యు నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించా లని పి డి ఎస్ యు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. సునీల్ మాట్లా డుతూ జిల్లాలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు హాస్టల్లో ఉంటూ చదువు కుంటారన్నారు. వారికి మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు హాస్టల్ బిల్ రూ.3 వేల నుంచి రూ. 3 వేలు 500 రావడంతో విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందన్నారు. అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. పభుత్వం టెక్నికల్ రంగాన్ని అభివద్ధి చేయాలని, తద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయ న్నారు.హాస్టల్లో విద్యార్థులు ఎదు ర్కొంటున్న సమస్యలను పట్టించుకోకపోవడం చాలా బాధాకర మన్నారు. అనంతరం ఆర్ డికు వినతిపత్రం సమర్పించారు. నగర అధ్యక్షులు ఆశీర్వాదం, సహాయ కార్యదర్శి మస్తాన్, కాలేజీ పి డి ఎస్ యు అధ్యక్షులు హర్ష , తాహీర్, అక్రమ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



ధర్నా చేస్తున్న నాయకులు

నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

వైసిపి రాష్ట్ర విభాగం ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం నెల్లూరు పాత జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీని జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున రిక్షా తొక్కుతూ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ యువత నాగార్జున వెంట ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద బయట నుంచి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదల కిషన్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి పేరుతో చంద్రబాబు యువతను దగా చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నప్పటికీ చంద్రబాబు చేత తల్లికి వందనం అమలు చేయించిన ఘనత వైఎస్‌ఆర్సిపి యువజన విభాగానిదని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి నెల్లూరు కార్పొరేషన్ : గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో టి- 20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గిరిజన యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు జయవర్ధన్ తెలిపారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 26 మండలాల నుంచి 24 టీమ్ లు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. నెల్లూరు, గూడూరు, కావలి మూడు జోన్ల వారీగా టి20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామన్నారు సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో విజేతలకు బహు మతులు అందజేశారు. మారుమూల గ్రామాల్లో నివసించే తమకు జిల్లా స్థాయి టోర్నమెంట్ ఆడే అవకాశం అందజేసిన నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయ వర్ధన్ కి క్రీడాకారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ లే అవుట్ల ఏర్పాటుకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి-నెల్లూరు నగరం : అక్రమ లేఅవుట్ల ఏర్పాటుకు అధికారులు అడ్డుకట్ట వేయాలని, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దామాఅంకయ్య మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమీ ప్రభుత్వం నిరుపేదలకు నివాస స్థలాలు ఇస్తారని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, ఎన్నికల హామీ ఇవ్వడం జరిగిందన్నారు. హామీ ఇవ్వడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. రెవెన్యూ శాఖలో ఆక్రమణకు గురైన భూములను గుర్తించి, ఆ భూములను అర్హులైన పేదలకు అందజేస్తామని నాయకులు తెలిపారన్నారు. పలు ప్రభుత్వ భూములను కబ్జా చేసి, అక్రమంగా లేఔట్ గా మార్చి కబ్జా దారులు విక్రయాలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటి పై అధికారులు విచారణ జరకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షాన్‌వాజ్, నంది పోగు రమణయ్య, సుబ్బరాయుడు, శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-కోవూరు : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. కోవూరు లోని తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. పథకాలకు కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంటుందన్నారు.కొన్ని పథకాలకు 50:50,కొన్నిటికి 60:40,కొన్నిటికి 70:30,మరికొన్నింటికి 90:10 రేషియోలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు విడుదల చేయక పోవడం వలన, రాష్ట్రం రూ.39,642 కోట్లు నష్టపోయిందన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన జరగడంతో పాటు అనేక వర్గాల కు ప్రయోజనం కలిగిందని తెలిపారు.

సచివాలయంలో తనిఖీ



ప్రజాశక్తి-అనంతసాగరం : పడమటి కంభంపాడు సచివాలయాన్ని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, డిప్యూటీ తహశీల్దార్ సోమవారం సందర్శించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బందికీ బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సిబ్బంది తమ శాఖలలో పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను సక్రమంగా పూర్తి చేయాలని తెలియజేశారు. సిబ్బంది ఎవరైనా క్షేత్రస్థాయిలో పనులు ఉన్నప్పుడు మూవ్ మెంట్ రిజిస్టర్ నందు నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది తమకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

మక్కా స్టీల్, ఐరన్ వర్క్‌షాపు ప్రారంభం



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం ముసునూరు ఆటోనగర్‌లో టిడిపి నాయకులు ఎస్ కే,సుభాని, ఎస్ కే,గయాజ్ నూతనంగా ఏర్పాటు చేసిన మక్కా స్టీల్ అండ్ ఐరన్ వర్క్స్ నూతనంగా ఏర్పాటు చేసిన షాపులను ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. షాపులను పరిశీలించి షాప్ యజమానులకు అభినందనలు తెలియజేశారు. వ్యాపారం దినదినాభివృద్ధి జరగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కంచర్ల శ్రీకాంత్‌కు పరామర్శ



ప్రజాశక్తి-కావలి : ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య ఇటీవల మరణిం చారు. సోమవారం కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ఎంఎల్‌సి శ్రీకాంత్‌ను కలిసి, ప్రగాఢ సానుభూతిని తెలిపిన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కలిసి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జర్నలిస్టుగా, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడిగా, విద్యావేత్తగా కంచర్ల రామయ్య అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి గుండెమడకల క్లస్టర్‌కు చెందిన రైతులు 926పొగాకు బేళ్లను తీసుకురాగా వీటిలో 694బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 223బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్ 17, ఎన్ బి 118, ఆర్ ఆర్ 54, సి ఆర్ 34 ఉన్నాయని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 09బేళ్లను వేలానికి తిరస్కరించారన్నారు. కిలోపొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.224.30కాగా వేలంలో 9మంది కంపనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

రజక సంఘం ఎన్నిక



ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండలం రజక సంఘం అధ్యక్షునిగా తూర్పు బోయమడుగుల గ్రామానికి చెందిన మూడల గురవయ్యను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చిలకపాటి సుబ్బారావు, యాదగిరి హజరత్‌లు, అడ్డేంగి మొలబ్బ చెరువుపల్లి నాగయ్య ఉన్నారు. ఉపాధ్యక్షులుగా కంచర్ల వెంకటేశ్వర్లు జనరల్ సెక్రటరీగా యాదగిరి తిరుపాలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెడ్డపల్లి వెంగళరావు, ట్రెజరర్‌గా యాదగిరి ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా రాయల నాగ మహేష్, దేవరకొండ బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పేర్నపాటి గురవయ్య, కాకునూరి చెన్నయ్య, కాకునూరి వెంకటరమణయ్య, కాకునూరి వీరశేఖర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏ సమస్య ఉన్న ఆ సమస్యలను పరిష్కరించేందుకు మేమందరం ఎల్లవేళ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

మూడ్రోజుల పాటు కుంభాభిషేకాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలో ఎంతో పురాతన ఆలయమైన శ్రీదేవి భూదేవి సమేత అలఘనాథ స్వామి ఆలయంలో ఆగస్టు 5, 6, 7 తేదీల్లో మహాకుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన అర్చకస్వామి తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టులో పుష్కరోత్సవ మహా కుంభాభిషేక నిర్వహణ ఏర్పాట్ల కోసం సోమవారం ఆలయంలో కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 5, 6, 7 తేదీలలో మహా కుంభాభిషేక కార్యక్రమం జరుగుతుందని, 7వ తేదీ మధ్యాహ్నం నూతన కళ్యాణ మండపంలో స్వామి వారి కళ్యాణం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయంలో జరుగుతున్న కార్యక్రమాలకు భక్తులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని, మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

రైల్వేగేటు వద్ద వాహనదారుల కష్టాలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట ప్రధాన రైల్వే గేట్ 144 వద్ద రైల్వే కార్మికులు రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తున్న కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటును మూసివేయడంతో వాహనదారులు, ఆర్‌టిసి బస్సులకు లారీలకు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బోగోలు మండలం సంబంధించిన పలు గ్రామాలు రైల్వే గేట్‌కు పడమర వైపు ఉన్న నాగులవరం, చెంచులక్ష్మి పురం, తాళ్లూరు, ఎన్ కండ్రిక, సోమేశ్వరపురం, కమ్మపాలెం, భాస్కర్ పాలె కండ్రిక వంటి పలు గ్రామాలు ఉండడంతో అక్కడి ప్రజలు వ్యాపార నిమిత్తం, ఉద్యోగరీత్యా చదువుకోడానికి ప్రతిరోజు కావలి, నెల్లూరు సుదీర ప్రాంతాలకు వెళ్లాలంటే 144 రైల్వే గేటు దాటుకొని వెళ్లవలసిన అవసరం ఉంది. రైల్వే మరమ్మతుల నిమిత్తం రైల్వే గేట్ మూసివేయడంతో 143 గేటు నుండి పాదచారులు, ద్విచక్ర వాహనాలు, చిన్న వాహనాలు నడిచాయి. పెద్ద వాహనాలు, ఆర్‌టిసి బస్సులు లారీలు కొండ బిట్రగుంట రైల్వే గేటు మీద నుండి నడిచాయి.

టిడిపి కార్యకర్తకు ఎంఎల్ఎ పరామర్శ



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం 8వ వార్డుకు సంబంధించిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడు షేక్ ఆసిఫ్ అనారోగ్యంతో బాధపడి శస్త్ర చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి ఆసిఫ్‌ను పరామర్శించారు. వైద్యుల సూచనలు పాటించి త్వరగా కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కప్పల పండుగా రథోత్సవం వైభవంగా కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి గ్రామంలోని పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలో ఎక్కడ చూసినా శివనామ స్మరణతో మార్మోగింది ఆలయ ఈవో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రావెల్ రవాణాతో రోడ్డు ధ్వంసం

- చర్యలు చేపట్టాలని అనంతవరం గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి-కావలి

దగదర్తి మండలం, అనంతవరం గ్రామం లోని సింగిల్ రోడ్డు గుండా హెవీ (30 టన్నుల) టిప్పర్లు గ్రావెల్ తోలుతుండడంతో రోడ్డు, బాగా పాడై పోతూ, రోడ్డు మధ్యలో చెరువు కలజు మీద ఉన్న బ్రిడ్జి కూడా కూలి పోయేందుకు సిద్ధంగా ఉందని, అధికారులు స్పందించి టిప్పర్లను ఆపు చేయించి, రోడ్డు, బ్రిడ్జిలను కాపాడాలని కోరుతూ గ్రామస్తులు ఆర్.డి.ఒ. కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల వేదికలో డివిజినల్ పరిపాలన అధికారి ఆర్.సూర్య నారాయణ సింగ్ కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంతవరం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి సింగిల్ రోడ్డు మార్గం మాత్రమే ఉందన్నారు. ఇటీవల గ్రావెల్ తోలకాలు ఎక్కువై, రోడ్డు పగుళ్లిచ్చి, గుంతలు పడిపోతూ ఉన్నదన్నారు. ఈ రోడ్డుకు మధ్యలో చెరువు కలజు వద్ద ఉన్న బ్రిడ్జి ఈ ఆదుటుకు కూలిపోయేందుకు సిద్ధంగా ఉందన్నారు. లారీలు సాయంత్రం 4 గంటల నుండి రాత్రంతా తిరుగుతూ, రోడ్డు మీద వెళుతున్న వాహనదారులకు, పాదచారులకు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ గిరిజన కాలనీ గుండా లారీలు తిరుగుతుంటే గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఎక్కువ లోడుతో సింగిల్ రోడ్డు పై అనుమతి లేకుండా వెళుతున్న వాహనాలను ఆపుచేసి, పాడై పోతున్న రోడ్డును, కలజు మీద బ్రిడ్జిని మరమ్మతులు చేయించాలని వారు ఆర్‌డిఓను తమ వినతి పత్రం ద్వారా కోరారు. కార్యక్ర మంలో అనంతవరం గ్రామస్తులు గోపసాని రమేష్, ఒంటేరు సుధాకర్, పెరికల మాల్యాద్రి, గురిజాల వెంకటేశ్వర్లు, ఎం.మహేష్, జి.రామయ్య, కె.వెంకట రమణయ్య, కె.శరవణ కుమార్, జి.దయాకర్, జి.సుభాషిణి, పి.కొండయ్య, జి.అశోక్, జి.మాల్యాద్రి, వి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పాఠశాల విలీనంపై ఆందోళన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

అనుమసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని అనుమ సముద్రం (ఎస్.సి.) స్కూలులోని 3, 4, 5 తరగతులను దగ్గరలో ఉన్న మెయిన్స్ స్కూల్లో కలపడంతో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. విషయాన్ని తెలుసుకున్న ఎంఇఒలు జ్యోతి, సాయిప్రసాద్ ఆ స్కూలుకు వెళ్లి పిఎంసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఇఒ జ్యోతి మాట్లాడుతూ మీకు ప్రత్యేకంగా ఆయాను ఏర్పాటు చేస్తామని, ఆమె మీ పిల్లలను రోజు స్కూలుకు తీసుకు వెళుతుందని, ఆ స్కూల్లో ఎల్ఇడి స్క్రీన్‌పై బోధనాభ్యాసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకే పాఠశాలను మూడు నాలుగు ఐదు తరగతులను అక్కడికి మార్పు చేయడం జరిగిందని, అవకాశం ఉంటే రానున్న రోజుల్లో యథావిధిగా స్కూల్‌ను కొనసాగిస్తామని నచ్చజెప్పి, అనుమసముద్రం ఎసి స్కూల్ పిల్లలను, మెయిన్ స్కూల్ లోకి అడ్మిట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సాయి ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు పులిమి సుధాకర్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ జ్యోతి



మెమొంటోలను అందజేస్తున్న ఎంపి బీద, ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

'సంయుక్త' వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కావలి

కావలి శ్రీనివాస కళ్యాణ మండపంలో సంయుక్త సేవా సంస్థ 10వ వార్షికోత్సవం, సంయుక్త నృత్య కళానిలయం 2వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి శాసనసభ సభ్యులు దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్, గౌరవ అతిథిగా బుల్లితెర, సినీనటులు, వాసుదేవ రావు హాజరైనారు. ఈ కార్యక్రమంలో మొదటిగ నృత్యకళా నిలయం చిన్నారులు ఆనందభరితంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. తదుపరి శాసన సభ్యులు డివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ 2015లో స్థాపించినప్పటి నుండి ఎన్నో కష్టాలు, బాధలు పడి సురేంద్ర, ఈ సంస్థను ఒక మంచి స్థితికి తెచ్చారని, ఒక ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, అభినందనీయమని తెలియజేశారు. వారి కుమార్తె కుమారి లిఖిత ఏర్పాటు చేసిన నృత్య కళానిలయానికి, నివేశన స్థలం మంజూరు చేయించడానికి తనవంతు సహాయ సహకారం త్వరితగతిన అందిదిస్తానని కరతాళ ధ్వనుల మధ్య హామీ ఇచ్చారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ సామాజిక సేవాతత్పరులు సురేంద్ర కుమార్తె నాట్య గురువు కుమారి లిఖిత అనారోగ్యంతో ఎన్నో కష్టాలు సమస్యల నుండి బయట పడి ఆరోగ్యంతో మన ముందు ఉందని, శాసనసభ్యులు నివేసన స్థలం మంజూరు చేయిస్తే, నృత్య కళానిలయంనకు తన ఎంపి నిధులనుండి నిధులు మంజూరు చేయిస్తానని హర్షధ్వనుల మధ్య హామి ఇచ్చారు. నృత్య కళా నిలయం చిన్నారులు ఆనంద భరితంగ నిరాటంకంగా నిర్వహించిన, నత్య ప్రదర్శనకు రూ.25వేల చెక్కును, బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ నుండి బహూకరించారు. ఈ సందర్భంగా సురేంద్ర, కుమారిలిఖిత ప్రశంగిస్తూ 2015వ సంవత్సరము నుండి ఇప్పటి వరకు సంయుక్త సేవా సంస్థ విజయవంతంగా నిర్వహిస్తున్నమంటే ఎందరో మహానుభావులు, మనసున్న దాతల, సహాయ, సహకారములతో, విజయవంతం కొనసాగుతుందని వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపు కుంటున్నామని తెలిపారు.

ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-అల్లూరు : అల్లూరు మండల ఎస్ఐగా ఏ.శ్రీనివాసులు రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ పాపారావు మాట్లాడుతూ చోరీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు టసుకుంటామని తెలియజేశారు. ప్రజలు కూడా ఎవరైనా అనుమానితులుగా అనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. అనంతరం నీటి సంఘం అధ్యక్షుడు కాళహస్తి వెంకటేశ్వర్లు ఇందుపూరు హరికృష్ణ కలిశారు.

భూ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉదయగిరి

రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం హాయంలో వ్యవసాయ భూమిని తగ్గించి అక్రమంగా ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిన వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం కొట్టాయిపల్లి భూ బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెండ్యాల గాంధీ, తండ్రి నరసింహులు, ఉదయగిరి మండలం కొట్టాయపాలెం గ్రామంలోని జరిగిన అవకతవకలు సర్వే నెంబర్ 101/8, 114/3లపై కలెక్టర్‌కు విషయాలను విన్నవించామన్నారు. అంతేకాకుండా తమ గ్రామంలో సర్వే నెంబర్ 114/3 ప్రభుత్వ భూమిగా ఉందన్నారు. ఆ భూమిని శ్మశానం బొక్కలగడ్డ భూమిగా మూడు తరాలుగా వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఆ భూమిలో రెండు ఎకరాలు సన్నిబోయిన సుజాత అనే ఆమెకు ధారాదత్తం చేశారు. అందుకోసం తహశీల్దార్ రూ.2 లక్షలు లంచం ఇచ్చామని ప్రచారం చేస్తున్నారన్నారు. అందులో వాస్తవాలు ఏమిటనేది తమకు తెలియనప్పటికీ శ్మశానంలో సమాధులను జెసిబితో దున్నించేశారన్నారు. శ్మశానంలోకి ఎవ్వరూ వెళ్ళకుండా కంచె కట్టేశారని తెలిపారు. అంతేగాక శ్మశాన భూమిలో ఉన్న రూ.2 లక్షలకు విలువగల 50యేళ్ల వయసున్న 30 వేప చెట్లను అమ్మేసుకున్నారన్నారు. గ్రామస్తులు తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. ఇవన్నీ గ్రామ, మండల స్థాయి అధికారులకు తెలిసినా అందరూ నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కావున విషయాలపై జిల్లాస్థాయి అధికారులతో విచారణ జరిపించి అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. తమ పాస్ బుక్‌లో తప్పులు సవరించి తమకు సంబంధించన 99 సెంట్ల భూమిని తమకు అప్పగించడానికి చర్యలు తీసుకొని, ఆక్రమణకు గురైన శ్మశానం భూమిని తిరిగి గ్రామస్తులకు అప్పగించటానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



సమస్యను తెలియజేస్తున్న బాధితులు

సర్వేయర్ల నిరసన

ప్రజాశక్తి-దగదర్తి


తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సర్వేయర్లు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి పెన్డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. జిఒ నెంబర్ 5ను వెంటనే రద్దుచేసి తమకు సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని గ్రామస్థాయిలో పనిచేసే తమను సొంత మండలాలలో పోస్టింగులు ఇవ్వరాదంటూ నిబంధనలను పెట్టడం సరికాదన్నారు. తాము ఇప్పటికే ఆరు సంవత్సరాల నుండి సర్వీస్‌లో కొనసాగుతున్న పదోన్నతులు విషయంలో నేటికీ స్పష్టత లేకపోవడం బాధాకరమన్నారు. బదిలీల విషయంలో రాజకీయ సిఫార్సులు లేకుండా పారదర్శకంగా బదిలీలు జరిగేలా ర్యాంకింగ్ల ఆధారంగా బదిలీలను చేపట్టాలని వారు కోరారు. మండలంలో ప్రస్తుతం 12 సచివాలయాలు ఏర్పాటయి ఉండగా రేషనైజేషన్లో వాటిని ఆరుకు కుదించారని మిగిలిన 6 సచివాలయాల సిబ్బందిని ఎక్కడికి తరలిస్తారో స్పష్టత స్పష్టతనివ్వాల్సిందిగా వారు డిమాండ్ చేస్తున్నారు. నేటి నుండి మూడు రోజులు పాటు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు మూడు రోజుల్లోగా తమ సమస్యలను పరిష్కరించనట్లయితే నిరవధిక నిరాహార దీక్షలకు జగనున్నట్లు సచివాలయ సర్వేయర్ల సంఘం హెచ్చరించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ నాయకులు ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దగదర్తి మండల సచివాలయ సర్వేయర్ల సంఘం నాయకుడు కంచర్ల రామానాయుడు తెలిపారు. ఈ విషయమై వారు తాసిల్దార్ పీ కృష్ణకు వినతిపత్రం సమర్పించి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కార్యాలయం ముందు ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.



నిరసన తెలుపుతున్న సర్వేయర్లు

ఎస్ఐగా ప్రభాకర్ బాధ్యతలు

ప్రజాశక్తి-బిట్రగుంట



బిట్రగుంట నూతన ఎస్ఐగా ఎన్.ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కావలి టు టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న ఎన్.ప్రభాకర్ బిట్రగుంట ఎస్ఐగా బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతలను స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఉంటే వెంటనే సమాచారాన్ని బిట్రగుంట పోలీస్ స్టేషన్ నెంబర్ 08626-246233 నెంబర్ కు తెలపాలని, సమాచారం ఇచ్చిన పేర్లను గోప్యంగా ఉంచుతామని, ప్రజలు పోలీసులకు సహకరించా లని, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసే అని, పోలీసుల దృష్టిలో అందరూ సమానులే అని తెలిపారు. పాత నేరస్తులపై నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.



పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ లక్ష్మయ్యనాయుడు

మాజీ ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట గ్రామంలో నూర్‌భాషా సంఘం నాయకులు జనాబ్ లేట్ డాక్టర్ షేక్ మౌలాలి సతీమణి మాజీ ఎంపిటిసి షేక్ మస్తాన్‌బీ సోమవారం తెల్లవారుజామున మరణించారు. విషయాన్ని తెలుసుకున్న ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ కొమ్మి లక్ష్మయ్య నాయుడు మస్తాన్‌బీ ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు వాకిచర్ల బాబు, శ్రీధర్, వెంకటరమణా రెడ్డి, యస్థాని, మండల నాయకులు పాల్గొన్నారు.



వైసిపి రాష్ట్రస్థాయి సమావేశంలో బొమ్మిరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వైసిపి పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర సమావేశం సోమవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో జరగడంతో ఆత్మకూరు నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి హాజరయ్యారు. వైసిపి అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ పటిష్టత కోసం భవిష్యత్తులో చేపట్టబోయే అంశాలపై చర్చించినట్లు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు.

చికెన్ వ్యర్థాలు వినియోగిస్తే చర్యలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : చేపల గుంతలు సాగు చేస్తున్న ఆక్వారైతులు చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తే చర్యలు తప్పవని సిఐ శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి వేకువ జామున దామరమడుగు, కాగులపాడు సమీపంలో చికెన్ వ్యర్థాలను తరలించే మూడు వాహనాలను అదుపులోకి తీసుకొని వాహన దారుల పైన కేసు నమోదు చేశామన్నారు. వాహనాలలో ఉన్న కుళ్లిన మాంసాన్ని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏ పొట్టెయ్య సమక్షంలో పంచనామా చేశామన్నారు. స్థానిక మండలంలో చేపలగుంటలు సాగు చేస్తున్న ఆక్వా రైతులు ఇష్టానుసారంగా చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారు. కుళ్ళిన మాంసాన్ని చేపల గుంటలలో వేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతూ మా వద్దకు వచ్చి చికెన్ వ్యర్థాలను ఉపయోగించే వాహనాలను ఆపాలంటూ తెలియజేశారన్నారు. స్థానిక శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాలతో త్వరలో పోలీస్ అధికారులు, మత్స్య శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు కలసి ఒక బృందంగా ఏర్పడి చెక్ పోస్ట్ ల వద్ద నిఘా ఉంచి చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకొని డ్రైవర్ల పైన, వాహనదారుల పైన, కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.సమావేశంలో ఎస్ఐ సంతోష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



విఆర్‌ఒలతో తహశీల్దారు సమీక్ష

ప్రజాశక్తి-దగదర్తి

విమానాశ్రయం భూములపై విఆర్‌ఒలతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.కృష్ణ సమావేశం ఏర్పాటు చేశారు. విమానాశ్రయంలో భూములు సర్వేనెంబర్ 334, 335, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎంక్వైరీ ఆఫీసర్‌గా విఆర్‌ఒలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకి వెళ్లి విచారించి అసలైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు దగ్గర ఎటువంటి ఆధారాలు ఉన్నాయో పరిశీలించి ఆధారాలు లేకుండా ఉంటే ఆధారాలు తెప్పించుకొని క్షుణ్ణంగా పరిశీలించి వారి పేరు నమోదు చేయాలని వీలైనంత త్వరగా పెండింగ్లో ఉన్న ఫైళ్లను పూర్తి చేసి నివేదికను తహశీల్దార్ కార్యాలయం అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు వేణు, నరేష్, సీనయ్య, బాలనాగమ్మ, గౌతమ్, తదితరులున్నారు.

బకాయిలు వసూలు చేయాలి

ప్రజాశక్తి-కావలి



కావలి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన అంగళ్ల బకాయిలు వెంటనే వసూలు చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. సోమవారం గ్రీవెన్స్ రోజు సందర్భంగా సోమవారం దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి ఇన్‌ఛార్జ్ ఆర్‌డిఒ సూర్యనారాయణ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ కావలిలో ఏరియా హాస్పటల్ ఆధ్వర్యంలో 20 అంగళ్ళు దాకా ఉన్నాయని తెలిపారు. ఆ షాపులకు సంబంధించి బకాయిలు వెంటనే వసూలు చేసి, తీర ప్రాంతాల నుండి వచ్చే పేషంట్‌లు భోజనాలు చేసేందుకు ఒక కాంప్లెక్స్ కట్టాలని, అందులో భోజనం చేసుకొనేందుకు సౌకర్యంవంతంగా ఉంటుందని, బకాయిలు వసూలు చేసి, అభివృద్ధికి పాటు పడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, కె.నరసింహులు, జెడ్డా వాసు, లక్ష్మి నర్సు, పాల్గొన్నారు.



ఇంటింటా శ్రామిక సర్వే

ప్రజాశక్తి-అనంతసాగరం

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనంతసాగరం పంచాయతీలోని సంజీవ నగర్ గిరిజన కాలనీలో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి గ్రామీణ శ్రామికుల సర్వేను మండల కార్యదర్శి అన్వర్ బాషా చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జకరయ్య, తిక్కవరపు రవి పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-దగదర్తి

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని తహశీల్దార్ పి.కృష్ణకు సిపిఎం నాయకులు గోపసాని రమేష్, ఒంటేరు సుధాకర్, పేరికల మాల్యాద్రి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ అధికారికి కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. రాత్రివేళలో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారన్నారు. దాంతో టిప్పర్లు తిరిగే దారిలో గిరిజన కాలనీ ఆనుకుని ఉందని తెలిపారు. టిప్పర్‌లో వెళ్లే సమయంలో రోడ్డు పైన ఉన్న దుమ్ము ఇళ్లపై పడుతుందని దాంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలిపారు. అంతేగాక పిల్లలు ఇప్పుడు వీధుల్లోనే తిరుగుతూ ఆడుకుంటూ ఉంటారన్నారు. అనంతవరం చెరువుకు ఆనుకుని ఉన్న కలుసు దాటే ఎందుకు బ్రిడ్జిని ఏర్పాటు చేసి ఉన్నారని బ్రిడ్జీ గతంలో కురిసిన వానలు కారణంగా బ్రిడ్జీ అక్కడక్కడ గుంతలు పడి ఉన్నాయన్నారు. దాంతో 30 టన్నుల గ్రావెల్ టిప్పర్ ఆ బ్రిడ్జిపై వెళ్తే బ్రిడ్జి కుంగిపోతుందని వాపోయారు. అంతేగాక అల్లూరు రోడ్డు నుంచి అనంతవరం వరకు ఏర్పాటు చేసిన తారు రోడ్డు టిప్పర్ల వల్ల గుంతలమయంగా తలపిస్తుందన్నారు. గ్రావెల్ తరలింపు ఆపివేయాలంటూ తహశీల్దార్‌ను కోరారు.



తహశీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

క్రీడాకారులకు ఎంఎల్ఎ అభినందనలు

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు జిల్లా క్రికెట్ జట్టుకు కావలి కె.సి.ఎ. నుండి 5మంది క్రీడాకారులు ఎంపిక య్యారని వారిని ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి అభినందిం చారు. అండర్ -19 విభాగానికి సమాధి భార్గవ్, లోకేష్ ఎంపిక కాగా అలానే అండర్-16 విభాగానికి రిషిత్, నవీంద్ర, యస్వంత్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఎంఎల్ఎ కృష్ణారెడ్డి అభినందించి భవిష్యత్తులో క్రికెట్‌లో బాగా రాణించి రాష్ట్ర స్థాయిలో కావలికి మంచి గుర్తింపు తీసుకుని రావాలని ఆయన ఆకాంక్షించారు. అలానే కావలి క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి ఎలాంటి సహకారమైనా అందిస్తానని ఎంఎల్ఎ కృష్ణారెడ్డి హామీనిచ్చారు. అలానే విద్యార్థుల చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కావలి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధు, క్రికెట్ కోచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.



క్రికెటర్లను అభినందిస్తున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి